# "సుఖమెరుగని జీవితాలు"

శ్రీమతి సత్యవాడ లక్ష్మీదేవి

ఉద్యాన వనములో ఒక చిన్న పెంకుటిల్లు వుంది. ఆ యింటికి సమీపాన్నే ఒక చిన్న కోనేటి కాలువ పారుతోంది. ఆయేటి కాలువ ఒడ్డున అనేక పూలచెట్లు పొదలు మొలచి మరింత దానికి సొగసు కల్పిస్తోంది. దాంట్లో నీరు పారుచున్నప్పుడు దూరమునుండి చూచువారికి ఒక పెద్ద వెండికడ్డీ పెట్టి నట్లు ప్రశాంతముగానుంది. సమీపాన చెట్లపైనున్న విహంగముల కలకల నాదములవలన మరింత శోభాయమానముగానుంది. ఇంటిముందు చెట్లు వరుసలు వరుసలుగా, చిత్రచిత్రముగా నున్నాయి. ఇంటిముందు రెండు విశాలములైన తిన్నెలున్నాయి. ఈ యింటిని చూచి ప్రతివారికి నిజముగ అక్కడ సౌఖ్య మనుభవింప బుద్ధిపుట్టక మానదు. నిజంగా ఈ ఇల్లు చూస్తుంటే భూలోక స్వర్గమా, అనిపిస్తుంది.

ఇట్టి కుటీరములో శశికళ, మనోహర్, నివశిస్తున్నారు.

మనోహర్ శశిని ప్రేమించునట్లు మరి ఏ పురుషుడు కూడా స్త్రీని ప్రేమించడని ఎంతో గర్వము శశికి. తక్కిన అందరు స్త్రీలూ "ఎన్ని నోములు నోచావోనమ్మా! ఎంత అదృష్టం!!" అంటూంటే శశి ఆనందడోలికలలో ఉయ్యాలలూగేది. మంచి ఉద్యోగం, కావలసినంత ఆస్తి! అన్నింటిని మించిన మగని ప్రేమ. శశి జీవితంలా ఏ స్త్రీది యుంది?

శశి చక్కని చుక్క. అంచాలరాసి. కమలేకుల వంటి నేత్రాలు. మంచి తలకట్టు, మనిషి చామన చాయ. పెసరకాయలవంటి పెదవులు, విశాలమైన నుదురుగలది. మనోహర్ శశి మొగుడనటానికి ఎంత మాత్రము తీసిపోడు! అందమైన హైరోడ్డు క్రాఫింగు, పసిమిరంగూ, విశాలమైన నేత్రాలు, వీటికి తోడు భుష్కోటు ధరిస్తాడు. ఇంక వేరే వర్ణించాలా? అంత అందమైన వాళ్ళ నిద్దర్నీ కూర్చినందుకు ఆదేవుణ్ణి మెచ్చుకోనివారెవరు?

ఎవరైనా ఇద్దరు దంపతులు అందమైన వాళ్ళవవచ్చు. కానీ వాళ్ళహృదయాలు కలియడం కష్టం. శశీ మనోహర్‌ల, శరీరాలు వేరుకానీ ఆత్మ లొకటే! నిత్యం ఆ పుణ్య దంపతు లిరువురు షికార్లే.

◆ ◆ ◆

ఆవేళ పూర్ణమి. మేఘచంద్రుడు వస్తుంకురిపిస్తున్నాడు. 'శశీ, ఇవాళ నాతో బీచికి రావాలి' అన్నాడు. మనోహర్. ఏడయ్యేటప్పటికల్లా శశి అపర రంభలా అలంకరించుకుంది. మంచి బెంగాలీ ఫేషన్ చీరకట్టి జార్జట్ జాకెట్ తొడిగి నెక్లెస్ పెట్టుకుని త్రాచుపాము వంటి జడకు నల్లని రిబ్బను పెట్టుకొని చంద్రకలా తయారవుతుంది ఆసుందరి. ఇక మనోహర్!

తెల్లని పొడుగు లాల్చీ కట్టుకొని, గళ్ళ గళ్ళ పేంట్ తొడుక్కొని, అందంగా క్రాఫ్ దువ్వుకొని చంద్రుడులా తయారవుతాడా సుందరుడు.

చక చకమని బీచివైపు చేతులు కలుపుకొని నడిచిందా జోడి. ఇసుకలో కూర్చున్నారు, నత్తగుల్లలను చూస్తూ. చంద్రుడు ఎంతబాగున్నాడో!

◆ ◆ ◆

"ఏమండీ దూరంగా పడవలో ఆ నావికుణ్ణి చూశారా? ఎంత హాయిగా వెడుతున్నాడో! ... ఒక్కటడుగుతాను. తీరుస్తారా?"

"నీకు తీర్చనిదేముంది, చెప్పుశశీ?"

"అదుగో, చూశారా? ఆపడవ ఎక్కుదామా?"

"శశీ, ఈవేళ పౌర్ణమి, కెరటాలెలా ఎగిరి పడుతున్నాయో చూశావా? చాలా ప్రమాదం సుమా!"

"ఆ, మరేం భయంలేదు. చాలా సరదాగా ఉందండీ?

ఈ పౌర్ణమిలో ... ఇలాంటప్పుడే, రతీ మన్మథుల్లా, ఆ అలలపైన స్వర్గంలోకి తేలిపోవాలిగానీ ... అయినా ఆ పల్లెవానికి లేనిభయం ... మనకెందుకని? పదండీ?"

తన ప్రియురాలు, తన ప్రాణం, తన స్వర్గం, తన చిన్న శశియొక్క కోర్కె తీర్చలేకుండా వుండలేక పోయాడు మనోహర్.

ఇద్దరూ, తారా చంద్రుల్లా కీవిగా పడవెక్కి కూర్చున్నారు. పల్లెవాడు నడుపుతున్నాడు.

శశి కోమలంగా "కన్నుల కింపవు వెన్నెల రేయి" అనేపాట నారంభించింది. ఆ స్వర్గీయ సుఖంలో ... అలా అరమైలు దాకా వెళ్లి పోయిందా బోటు. అప్పుడు తెలివి వచ్చిందా ప్రియునకు.

"అమ్మయ్యో, పడవ ఎలా ఊగిపోతోందో!"

"శశీ! ఎంతదూరం వచ్చేశామో! ఏమోయి బోటును వెనక్కి నడుపు! ..."

పావుమైలు వెనక్కి అతిప్రయాసతో పడవను లాక్కొచ్చాడు పల్లెవాడు.

ఇకలాభం లేకపోయింది. రాత్రితోపాటు కెరటాలు ఎక్కువై పోయాయి.

శశి కంగారు పడింది.

"అమ్మయ్యో! ..."

మనోహర్‌కు ఈత చాలాబాగా వచ్చు.

అనుకోకుండా శశి మాటేనా ఆలోచించకుండా గభాలుమని నీటిలో కుంకేశాడు మనోహర్.

శశి సున్నిత మనస్సు గుభిల్లుమంది.

మనస్సుతోపాటు, పడవ కూడా గిర గిరమని తిరిగి పోతోంది ... పల్లెవాడు, తనూ, పడవలో సగం నీళ్లలో మునిగిపోయారు.

పెద్ద అలవచ్చి ఆ నావికా శశిలను కొట్టేసింది.

♦ ♦ ♦

తడిసిన షరాయితో ఉక్కిరి బిక్కిరియై వడ్డున చేరాడు మనోహర్.

అంతదాకా ఆవాతావరణంలో, అభయంకర తరంగాలలో అతనికి శశిమాటే జ్ఞాపకం లేదు.

శశిని వదిలేసి ఇలా వచ్చేయడం ఏమైనా బాగుందా? తన శశిలేకుండా ఏమొహం పెట్టుకుని ఆమెమాట మరచిపోయి బయట పడ్డాడు, తనుకి ఒక్కటే సమాధానం చెప్పతోంది మనస్సు. "ఆత్మ సంరక్షణ మప్పుడు ఆత్మబంధువులైనా జ్ఞాపకం రారు. నీతప్పులేదు."

ఎందుకొచ్చిన ఆత్మ సంరక్షణ! తన శశిని రక్షించకుండా ఎందుకువచ్చిన ఈత! శశిరక్షణ కంటే ఆత్మ రక్షణ ఎక్కువా? శశి త్యాగం కన్న ఆత్మ త్యాగము మేలు. పాపం, యీపాటికి ఆ, అభాగిని ఏతరంగ హస్తంలో ఉందో!

మనోహర్ కన్నీళ్ల నాపుకోలేకపోయాడు. ఛీ, వెధవబ్రతుకు ఏదౌర్భాగ్య సముద్రాన్ని జయించి, భేదించుకుని బయటకు వచ్చాడో ఆసముద్రంలోకే వెళ్లిపోతున్నాడు మనోహర్.

♦ ♦ ♦

అతిప్రయాసపడి నావికుడు శశిని బయటికి తీసుకొనివచ్చి వడ్డున పరుండ బెట్టేడు. కొంచెం విసరి "అమ్మగారూ" అని పిల్చాడు. కొంతసేపటికి స్మృతి తప్పిన శశి మెల్లిగా కదిలింది.

పల్లెవాని సంతోషానికి అంతులేదు.

శశి తన నేత్రాలొక్కసారి విప్పిచూసింది. ఆ వెన్నెలలో, ఈ విప్పారిన చంద్రికలో ఎవరో గబగబ సముద్రంలోకి వెళ్లిపోతున్నారు. మనోహర్ కాదుకదా.

తన శక్తినంతను ఉపయోగించి గట్టిగా "మనోహర్" అని అరచింది శశి!

పల్లెవాడు "బాబుగారు" అని పెద్దకేకలు పెట్టేడు. వారిద్దరి కృషి ఫలించింది.

మనోహర్ నమ్మలేకపోయాడు. తన శశి ... తను వదిలేసిన శశా?? నీటిలోనుంచి పైకివచ్చేశాడు. అరఫర్లాంగు దూరంలో పడుకొని యున్న శశిని పోలికపట్టేడు మనోహర్.

"శశీ ! ... ఒక్క పరుగు పెట్టేడు.

తరువాత ఇద్దరు ఇంటికి వెళ్ళేరు.

♦ ♦

ఇంటికి సుఖంగా చేరిందన్న మాటేగానీ శశి మనసు, మనసులో లేదు. "తన్ను వదిలేసి స్వార్థపరుడై ప్రాణప్రదమనుకున్న భర్త స్వప్రాణములు రక్షించుకున్నాడు. "మగవారెంతకైన సమర్థులు" తన్నా నావికుడు రక్షించకపోతే? ...

మనోహర్ అప్పుడే క్షమాపణ వేడుకున్నాడు. "శశీ ఒళ్లుతెలియని పరిస్థితిలో నా ప్రాణాలు రక్షించుకున్నాను ... నన్ను ... క్షమించవూ? ...

శశి మాట్లాడలేదు.

క్షమాపణ ! తనను వదిలేసి స్వార్థపరుడైన తన మగనికా క్షమాపణ !

♦ ♦ ♦

శశికి మగనిమీద పూర్వపు ప్రేమ లేదు. ఎప్పుడూ చిరుస్సులూ, బుస్సులూ !

మనోహర్ మాత్రం శశిని నిర్మలంగా ప్రేమిస్తున్నాడు. రోజులు దొర్లిపోతున్నాయి. సంవత్సరాలు గడిచిపోతున్నాయి. ఇప్పుడు శశికి చక్కని పూర్ణచంద్రుడివంటి కొడుకు.

♦ ♦ ♦

ఆవేళ పౌర్ణమి. రాత్రిసమయం. శశి మనోహర్‌లు విశ్రాంతి తీసుకుంటున్నారు.

ఆవేళ పశువుల కాపరి పాకలో దాలి పొయ్యి మీద పులవలు ఉడకబెట్టి చిన్న నిద్రతీశాడు. దాలి పొయ్యి ఆర్పడం మరచి పోయాడు. పొయ్యిలో నుండి చిన్న నిప్పురవ్వ యెగిరి పాక అంటుకుంది. పశువులకాపరిలేచి పరుగెత్తుకుంటూ వీధిలోకి వెళ్లిపోయినాడు.

శశి మంచి గాఢనిద్రలోనుంది. ఒక్కనిప్పురవ్వ పడగానే లేచింది. చుట్టూ మంటలు, పొగ; ఆమెకేంచెయ్యడానికీ తోచలేదు.

పిల్లాణ్ణి తీసుకుని అప్రయత్నంగా క్రిందకి పరుగులెట్టింది. ఆమెకా గొడవలో మగని సంగతే జ్ఞాపకం లేదు. మనోహర్ ఏమయ్యాడో యేమో ! ...

పిల్లాణ్ణి తీసుకుని ఇవలకు రాగానే శశికి మనోహర్ మాట జ్ఞాపకం వచ్చింది. ఇంకెక్కడి మనోహర్. ఆనిర్మలు డప్పుడే కండ్లుమూసేడు.

♦ ♦ ♦

చంద్రుణ్ణి చూస్తూ ఆనిర్భాగ్యురాలు యిలా అనుకుంది. "మగనినైనా లేపకుండా పరుగు పరుగున క్రిందికొచ్చి ప్రాణాలు రక్షించుకున్నా ! ఎంత స్వార్థపరురాలను!" ఆనాడు జరిగిన సముద్ర సంఘటన జ్ఞాపకం వచ్చింది. ఊగిపోతున్న అలలలో నడిసముద్రంలో అతిభయంకర వాతావరణలో తన మగడు ప్రాణాలు రక్షించుకున్నాడని బ్రతికున్న నాళ్లు దెప్పి పొడిచింది. ఇప్పుడు తను ...? తనదాకా వస్తే... ఆనాడు తన్ను నావికుడు రక్షించాడు. ఇప్పుడు తన మగణ్ణెవరు రక్షించారు? "సుఖమెరుగని జీవితా" లంటే ఇలా ఉంటాయికదా ! శశి కన్నీరు మున్నీరయి పోయింది.

♦ ♦ ♦

ఇప్పుడామె ఒకపిచ్చిది. ఆమెజీవిత సందేశం యిది. "ఆత్మ సంరక్షణ మప్పుడు ఆత్మబంధువులేనా జ్ఞాపకంరారు !"

"సుఖమెరుగని జీవితాలు" ఈవిశాల ప్రపంచంలో జీవించడం కంటే ఒక్కసారి గుక్కెడు ప్రాణాలు పోగొట్టుకోడం ఉత్తమం.